గృహజ్యోతి పథకం ప్రారంభం 8

7 మహా శివరాత్రికి ముస్తాబైన రాజన్న క్షేత్రం



ఆలయ అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు

- కొత్త ప్రభుత్వం వైపు భక్తుల చూపు
- గత ప్రభుత్వంలో 410 కోట్లతో ప్రతిపాదనలు
- నిద్రావస్థలో వీటీడీఏ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న ఆలయాన్ని సందర్శించాలనుకున్నారు. అనివార్యకారణాలతో పర్యటన రద్దయ్యింది. అయినప్పటికీ కొత్త ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి అడుగులు పడతాయని రాజన్న భక్తులు, స్థానికులు ఆశతో ఎదురు చూస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసే దిశగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని కాంగ్రెస్ నాయకులు కొన్ని రోజులుగా చెబుతున్నారు. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటన ఖరారవడంతో ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ప్రత్యేక రాష్ట్రంలో అతి పెద్ద శైవక్షేత్రంగా ఏర్పడిన వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ఏటా వంద కోట్ల రూపాయలు కేటాయిస్తానని 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి కోసం 2016 ఫిబ్రవరిలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీని (వీటీఏడీఏ) ఏర్పాటు చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ముద్దసాని పురుషోత్తమరెడ్డి వైస్ చైర్మన్‌గా, అప్పటి సీఎం కేసీఆర్ చైర్మన్‌గా వ్యవహరించిన వీటీడీఏ ఆధ్వర్యంలో రూ.410 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టాల్సిన 13 అంశాలతో కూడిన పనుల ప్రతిపాదనలను రూపొందించారు.

● వీటీడీఏ వైస్ చైర్మన్‌గా కలెక్టర్

వీటీడీఏ వైస్ చైర్మన్‌గా కలెక్టర్ అనురాగ్ జయంతి వ్యవహరిస్తు న్నారు. ఇంతకుముందు వైస్ చైర్మన్‌గా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముద్దసాని పురుషోత్తమరెడ్డి వ్యక్తిగత కారణాలతో తన పదవి నుంచి వైదొలిగారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే వీటీడీఏపై దృష్టి సారించి ఖాళీగా ఉన్న వీటీడీఏ వైస్ చైర్మన్ పదవిని జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. దీంతో ఆయన ఆలయ అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ఇదిలా ఉండగా ఇంతకుముందు హైదరాబాద్‌లో కొనసాగిన వీటీడీఏ కార్యాలయాన్ని కొంతకాలం కింద వేములవాడకు తరలించారు. కార్యాలయాన్ని వేములవాడకు తరలించిన క్రమంలోనే పురుషోత్తం రెడ్డి పదవి నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం వేములవాడలోని అమ్మవారి కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న వీటీడీఏకు తగినంత మంది సిబ్బంది లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా వేములవాడకు వస్తుండడంతో ఆలయ అభివృద్ధిపై స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వేములవాడ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధికి దశలవారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

● నామమాత్రంగా పనులు

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన వీటీడీఏ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జరిగిన పనులు నామమాత్రమేనని చెప్పాలి. వీటీడీఏ ద్వారా ఏడున్నర సంవత్సరాల వ్యవధిలో కేవలం 19.68 కోట్ల రూపాయల పనులు మాత్రమే పూర్తి చేసినట్లు అధికారుల గణాంకాల ద్వారా తెలుస్తోంది. వీటిలో 15.83 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కోరుట్ల, జగిత్యాల, చెక్కపెల్లి వైపు రోడ్లను ఆధునికీకరించారు. 3.32 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రాజన్న భక్తుల కోసం మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారు. 53 లక్షల రూపాయలతో వేములవాడ- దొంగలమర్రి మార్గంలో కల్వర్టులను నిర్మించారు. ఈ మూడు పనులు మినహా వీటీడీఏ ద్వారా ఒక్క పనికూడా అదనంగా చేయలేదు. ఆలయ విస్తరణ కోసం గుడిచెరువును 35 ఎకరాల మేరకు పూడ్చివేశారు. గుడి చెరువు విస్తర ణకు చెరువు పక్కన ఉన్న భూముల యజ మానులకు వీటీడీఏ ద్వారా 30 కోట్ల రూపా యలను చెల్లించారు.

● ఖరారు కాని డిజైన్లు

వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించిన తుది డిజైన్ల ఖరారు సుదీర్ఘ కాలంగా అటకెక్కింది. ఆగమ, వాస్తుశాస్త్ర నిపుణులు, శిల్పులు అందజేసిన నివేదికలతో వీటీడీఏ అధికారులు ప్రతిపాదనలు, డిజైన్లు సిద్ధం చేసి తొలిదశలో నాటి సీఎం కేసీఆర్ ఆమోదం పొందిన తరువాత శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థస్వామివారిని కలిసి చర్చించారు. చిన్న చిన్న మార్పులతో స్వామీజీ విస్తరణ పనులకు ఆమోదం తెలిపారు. అయితే వచ్చే వెయ్యేళ్లపాటు భక్తుల అవసరాలకు సరిపడే విధంగా సౌకర్యాలు ఉండాలని, డిజైన్లు కూడా వైవిధ్యంగా ఉండాలని నాటి సీఎం కేసీఆర్ ఆదేశించడంతో వీటీడీఏ అధికారులు కొత్తగా మళ్లీ డిజైన్లు తయారు చేయించారు. వీటిని కేసీఆర్ పరిశీలించనేలేదు. గుడి చెరువులో దాదాపు 35 ఎకరాలు పూడ్చి ఆలయ విస్తరణ, పలు నిర్మాణాల కోసం కేటా యించగా సాంకేతిక కారణాల రీత్యా శాశ్వత ప్రాతిపదికన పనులు నేటికీ ప్రారంభించలేదు.

మొత్తం మీద గడిచిన ఏడున్నర సంవత్సరాల కాలంలో వీటీడీఏ ద్వారా చేసిన ఖర్చు రూ.77.90 కోట్లు మాత్రమే. ఇందులో బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ కోసం చుట్టు పక్కల ఇళ్ల యజమానులకు రూ.20 కోట్లను వీటీడీఏ ద్వారా ఇచ్చిన ప్పటికీ వాటిని రాజన్న ఆలయ ఫిక్స్ డిపాజిట్ల నుంచి తాత్కాలిక అప్పు కింద తీసుకోవడం గమనార్హం. కొద్ది రోజులలో ఈ 20 కోట్ల రూపా యలను ఆలయానికి తిరిగి ఇస్తామని చెప్పినప్పటికీ ఆ సొమ్ము అంతా ఆలయ ఖజానాకు చేరలేదు. ట్యాంక్ బండ్ నిర్మాణం, రిటెయి నింగ్ వాల్ నిర్మాణం కోసం మిషన్ కాకతీయ ద్వారా రూ.90.34 కోట్లు కేటా యించగా 70 శాతం పనులు పూర్తి చేసి మధ్యలోనే వదిలేశారు. జీహె చ్‌ఎంసీ ద్వారా ఇచ్చిన రూ.30 కోట్ల రుణం ద్వారా ట్యాంక్ బండ్ పనులకు రూ.12 కోట్లు, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు, గుడి చెరువు స్థలంలో రూ.90 లక్షలతో శివార్చన వేదిక పనులు చేపట్టగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఏడున్నర సంవత్సరాల కాలంలో వీటీడీఏ సిబ్బంది వేతనాలు, అద్దెలు, ఫర్నీచర్, సర్వేలు, మాస్టర్ ప్లాన్, డిజైన్ల ఖరారుతోపాటు పరిపాలన పరమైన అవ సరాల కోసం రూ.8.22 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం.

దశలవారీగా ఆలయ అభివృద్ధి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనకు రానున్నారని పేర్కొన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై మూడు నెలలుగా తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, అవసరమైన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం గతంలో మంజూరైన 30 కోట్ల రూపాయల సాఫ్ట్ లోన్ నుంచి తిరిగి వెళ్లిపోయిన 20 కోట్ల రూపాయలను మళ్లీ తెప్పించామని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్ల వెడల్పు కోసం 35 కోట్ల రూపాయలు త్వరలో మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధితోపాటు వసతి గదుల నిర్మాణం ఇతర పనుల కోసం దశలవారీగా ప్రభుత్వం నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. ఖాళీగా ఉన్న వీటీడీఏ వైస్ చైర్మన్ స్థానాన్ని కలెక్టర్‌తో భర్తీ చేశామని, ఆలయ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వివరించారు.

మండల అభివృద్ధికి కృషి



భూమి పూజ చేస్తున్న జడ్పీటీసీ నాగం కుమార్

చందుర్తి, మార్చి 5: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని జోగాపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడీపీ నిధులు మంజూరయ్యాయన్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నిధులు వెచ్చించి అభివృద్ధిలో ముందుంటామన్నారు. ఎంపీటీసీ గణేష్, మాజీ సర్పంచ్ రాజమల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 5: వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో తాగునీటి సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో లోపాలను సరిచూసుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే స్థానికంగా పరిష్కరించాలన్నారు. బడ్జెట్ ఎక్కువగా ఉండే పనులపై ఉన్నతాధికారులతో మాట్లాడి ముందుకు వెళ్లాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పైప్ లైన్ దెబ్బతింటే సంబంధిత అధికారులతో పనులు చేయించాలన్నారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు గ్రామాల్లో నిత్యం పర్యటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీర బుచ్చయ్య, మిషన్ భగీరథ ఈఈలు జానకి, విజయ్ కుమార్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 5 : ప్రజల ఆశీర్వాదంతో తనకు ఎమ్మెల్యే పదవి వచ్చిందని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ భవన్ నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీని, పట్టణంలోని ఆయన నివాసంలో పలు కుల సంఘాల అభివృద్ధి పనుల ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కొంత మంది ఎమ్మెల్యే పదవిని హోదాకు చిహ్నంగా ఉపయోగించుకున్నారన్నారు. తన గెలుపులో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. తాను మాట్లాడిన ప్రతీ మాటను అక్షరాల రూపంలో ప్రజలకు చేర వేశారని, తన గెలుపునకు తోడ్పాటునందించారని గుర్తు చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని గత పాల కులు అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ ఎమ్మెల్యేకు రూ. 10 కోట్లు కేటాయించారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రెస్ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగూరి మహేష్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన వాయిదా

సిరిసిల్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7న సిరిసిల్ల, వేములవాడ పర్యటన వాయిదా పడింది. ఏఐసీసీ సమావేశాల నేపథ్యంలో పర్యటన వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. సిరిసిల్లలో జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభోత్సవం, వేములవాడలో రాజరాజేశ్వరస్వామికి పట్టు వస్త్రాల సమర్పణతో పాటు బహిరంగ సభ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. పర్యటన వాయిదా పడడంతో నిరాశ ఏర్పడింది.

లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 5: ప్రజా పాలన సేవ కేంద్రాల ద్వారా ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల వివరాలను ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని విద్యుత్‌శాఖ కార్యదర్శి ఎస్.ఎ.ఎం రిజ్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్టర్‌లో వివరాల నమోదుపై హైదరాబాద్ నుంచి కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వి మాట్లాడుతూ అర్హులకు ఆరు గ్యారెంటీలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతీ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీలలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం కింద క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్‌లో నమోదు చేశామన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ విద్యుత్ మీటర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని వారు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్‌వేర్ పనితీరును రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజా పాలన సేవా కేంద్రాలలో అవసరమైన మేర దరఖాస్తులు అందుబాటులో ఉండాలని, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు

సిరిసిల్ల రూరల్, మార్చి 5 : రైతులకు వ్యవసాయ పరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు సమావేశాలను నిర్వహించుకునేందుకు గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 57 రైతు వేదికలను నిర్మించింది. వీటిల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సిరిసిల్ల నియోజకవర్గంలోని చంద్రంపేట, వేములవాడ నియోజకవర్గంలోని హన్మాజీపేట రైతువేదికలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యసాయాధికారి భాస్కర్ తెలిపారు. ఈ రెండు రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయం నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయ ఉత్సవ కమిటీ నియామకం

సిరిసిల్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీని నియమించినట్లు దేవదాయశాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులుగా అనుముల చంద్రయ్య, వడ్డెపల్లి వెంకటరమణ, కే రాజిరెడ్డి, సీ విజయలక్ష్మి, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మి, కూరగాయాల కొమురయ్య, సంద్రగిరి శ్రీనివాస్, కనికరపు రాకేష్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూం సంతోష్, వకులభరణం శ్రీనివాస్, పిల్లి కనుకయ్య, సంఘ స్వామి, జగన్‌మోహన్‌రెడ్డి, చేపూరి గంగయ్య, చింతపంటి రామస్వామి, కయాతి నాగరాజు, తోట్ల అంజయ్య, ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, దార్న మల్లేశంను ఉత్సవ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు.

మహాశివరాత్రి ఆహ్వాన పత్రికల అందజేత

సిరిసిల్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి జాతర సందర్భంగా పలువురు ప్రముఖులకు మంగళవారం ఆలయ అధికారులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్, ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయిని వారివారి కార్యాలయాల్లో కలిసినట్లు రాజన్న ఆలయ పీఆర్వో తెలిపారు.

వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌ను కలిసిన మైనార్టీ నాయకులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట) మార్చి 5: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మండల మైనార్టీ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వక్ఫ్ బోర్డు భూములు, ఖబ్రస్తాన్ భూములు, మసీదు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనికోరారు. ఆయన వెంట మహమ్మద్ ఖాజా, మహమ్మద్ రఫీ, షేక్ ఇమామ్, షేక్ హైమద్, మహమ్మద్ సమద్, ఆఫాన్ ఉన్నారు.

సిరిసిల్ల స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా మురళీ కృష్ణ

సిరిసిల్ల క్రైం, మార్చి 5: జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా మురళీకృష్ణను నియమిస్తూ డీజీపీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల ఎస్‌బీ డీఎస్పీ మహేశ్‌బాబు జగిత్యాల డీసీఆర్‌బీ ఫంక్షనల్ వర్టికల్స్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. సిరిసిల్ల డీసీఆర్‌బీ డీఎస్పీ డి.ప్రణీత్‌కుమార్‌ను గత ప్రభుత్వ హయాంలో ప్రతి పక్షనేతల ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై సస్పెండ్ చేస్తూ సిరిసిల్ల డీసీఆర్‌బీ ఫంక్షనల్ వర్టికల్ డీఎస్పీగా మహ్మద్ సర్వర్‌ను నియమించారు. సిరిసిల్లకు బదిలీ అయిన వారం రోజుల్లోనే ప్రణీత్‌కుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఉపాధికి దూరమైన విలీన గ్రామాల ప్రజలు

సిరిసిల్ల రూరల్, మార్చి 5 : మున్సిపల్ విలీన గ్రామాల ప్రజలు ఉపాధికి దూరమయ్యారని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో మంగళవారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు చల్ల హరికృష్ణతోపాటు బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సుంకరి సాయికుమార్, మాజీ సర్పంచులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసి సమస్యలను ప్రజల నెత్తిన మోపిన ఘనత మాజీ మంత్రి ఎమ్మెల్యే కేటీఆర్‌కు దక్కు తుందన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం కల్పించే మహా త్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో పనులు దొరుకు తుండేవన్నారు. వాటిని గ్రామపంచాయతీలుగా మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరదేవరాజు, జాల్గం ప్రవీణ్‌కుమార్, వైద్యశివప్రసాద్, గడ్డం నర్సయ్య, పూర్మాణి లింగారెడ్డి పాల్గొన్నారు.

ఉరిసిల్లను సిరి సంపదలకు నిలయంగా మార్చాం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాంగ్రెస్ హయాంలో సిరిసిల్లను ఉరిసిల్లగా చేశారని, ఆత్మహత్యల పేరు పడిందని, కేసీఆర్ ఉరిసిల్లను సిరిసంపదలకు నిలయంగా మార్చారని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ ఎంత అభివృద్ధి చేశారో జిల్లాకు వస్తున్న రేవంత్‌రెడ్డి చూసి పోవాలన్నారు. జిల్లాకు మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్, వ్యవసాయ పాలిటెక్నిక్, డిగ్రీ, నర్సింగ్ కళాశాలలు చూడవచ్చని అన్నారు. కేసీఆర్ కట్టిన బిల్డింగ్ రిబ్బన్ కట్ చేయడం తప్ప దేనికి పనికి రారన్నారు. సిరిసిల్ల వేదికపై నుంచి బతుకమ్మ చీరల ఆర్డర్లు ప్రకటించాలని, కాటన్ పరిశ్రమను ఆదుకోవాలని అన్నారు. తనమీద కోపంతో నేతన్నలను, కేసీఆర్‌పై కోపంతో రైతులపై కక్ష సాధింపు చేయవద్దన్నారు. సిరిసిల్లలో తన మీద నాలుగు సార్లు ఓడిపోయిన మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎక్కడా లేని అహంకారం కళ్ల నెత్తికెక్కి మాట్లాడుతున్నారన్నారు. పదేళ్ల మంత్రిగా ఉన్న తాను ఏనాడూ మాట్లాడలేదన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక నేత కార్మికుడు పాపుడాలు అమ్ముకుంటున్నాడని మీడియాలో వస్తే ఇన్ని రోజులు దొబ్బి తిన్నది చాలదా? అంటూ మాట్లాడడంపై ఆగ్రహించారు. అధికారం వచ్చి వంద రోజులు కాలేదని ముఖ్యమంత్రికి కేసీఆర్ మీద కోపం రైతులమీద చూపితే పద్మశాలీలు ఓట్లు వేయలేదని, బతుకమ్మ చీరల ఆర్డర్లు రద్దు చేశారని అన్నారు. నాలుగుసార్లు ఓడించినా బుద్ధిరాలేదన్నారు. సిరిసిల్లకు వస్తున్న రేవంత్‌రెడ్డి నేత కార్మికులకు మహేందర్‌రెడ్డితో క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

● రేవంత్‌రెడ్డి మోదీని బుట్టలో వేసుకోవడానికి బడాభాయ్, చోటాభాయ్ అంటూ మాట్లాడుతున్నారని, అది చూస్తే తెలంగాణలో బడే మియాతో బడేమియా చోటామియా సుభానల్లా అని అయనేం చేయడు, ఈయన ఏమి చేయడని అన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి బీజేపీ, ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్ పత్రికలో ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసి బడాభాయ్ అనే పాత వాసనలు పోకపోవచ్చన్నారు. ఆత్మగౌరవం ఉన్న తెలంగాణ బిడ్డ తెలంగాణ మోడల్ గురించి చెబుతారని, గుజరాత్ మోడల్‌గా రాష్ట్రాన్ని మంచిగా చేసుకుంటానని ఎవరైనా చెబుతారా అని అన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు ఉండగా బడాభాయ్ ఆశీర్వాదం భవిష్యత్‌లో ఉండాలని కోరుకోవడం చూస్తే రాహుల్‌గాంధీ గెలిచేది లేదు. పీకేది లేదు నువ్వే ప్రధాని అని చెప్పినట్లు కాదా? అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై చర్చ జరుగుతోందని, కేసీఆర్ లక్షల కోట్లు తిన్నారని ముఖ్యమంత్రి నుంచి కింద ఉన్న కాంగ్రెస్ సన్నాసుల వరకు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని 40 లక్షల ఎకరాలకు, సగం తెలంగాణకు సంబంధం ఉందని అన్నారు. 85 పిల్లర్లు ఉన్న మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే కుంగిందని దాని చుట్టూ కేసీఆర్ ఉంటే కాపర్ డ్యాం కట్టి మిగతీ నీళ్ల అటు పోకుండా ఒక పంప్‌తో నైనా నీళ్ల నింపేవారన్నారు. ఈ ప్రభుత్వానికి తెలివి లేదన్నారు. రోజు 5 వేల క్యూసెక్కుల నీళ్ల కిందకు వెళ్తున్నాయన్నారు.

● రాజకీయాల్లో సిగ్గులేని తనం ఎక్కువగా ఉంటుందని, మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలని చెప్పుకోవడానికి సిగ్గు పడడం లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి వచ్చి 90 రోజులు అవుతోందని, 15,750 పోలీస్ ఉద్యోగాలు, 5962 నర్సింగ్ ఉద్యోగాల కాగితాలు ఇచ్చి 30వేలఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారన్నారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చానని చెప్పుకోడందివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ఒక్క పనీ చేయలేదు..

కరీంనగర్ ఎంపీగా ఒక్క పని కూడా బండి సంజయ్ చేయలేదని, అమిత్‌షా చెప్పులు మోయడం తప్ప ఒక్క గుడి, బడి, కట్టలేదని కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ కూడా ఏం చేశాడో తెలియదని ద్వారకాలో మాత్రం నీళ్లలో మునిగి ఏదో చేశాడని ఎద్దేవా చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 50 వేల మెజార్టీ ఇవ్వాలన్నారు. 12న కరీంనగర్‌లో జరిగే కదనభేరిని విజయవంతం చేయాలన్నారు. ఫ్రీగా ఎల్‌ఆర్‌ఎస్ చేసే విధంగా సిరిసిల్లలో 6న ఎల్‌ఆర్‌ఎస్‌పై జరిగే ధర్నా విజయవంతం చేయాలన్నారు. 8న కలెక్టర్‌కు వినతిపత్రం అందించాలన్నారు. ముస్తాబాద్ నుంచి దుబ్బాక మండలానికి గత ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా టెండర్ కూడా పూర్తి చేసిన తర్వాత ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, మాజీ ఎంపీపీ సరస్వతి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మాట్ల మధు, మదన్, దేవదాస్, మీరాల భాస్కర్ యాదవ్, పడిగెల రాజు, బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

జమ్మికుంట, మార్చి 5: జమ్మికుంట రైల్వే స్టేషన్లో ఓ వృద్ధుడు (65) పట్టాలు దాటుతుండగా అయోధ్య స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తిం పు కార్డులు లభించలేదు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌షర్ట్, దానిపై నలుపు లైట్‌బ్రౌన్ రంగు నిలువు గీతల డిజైన్, నీలి రంగు గీతల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చు రీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కె ట్‌కు 71మంది రైతులు 687క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు క్వింటా ళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహి రంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, మార్చి 5: దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు 200 రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ సృజన మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట్ మండలం సింగారం గ్రామానికి చెందిన ఘనగోని బంటి షాప్‌లో సెప్టెంబర్ 2, 2023న రాత్రి 10 గంటల సమయంలో దొంగతనం జరిగింది. షాప్‌లో క్యాష్ కౌంటర్‌ను ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 3,500 దొంగతనం చేసారని బాధితులు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నేరస్తుడిని పట్టుకొని కోర్టుకి తరలించారు. కోర్టులో నేరస్థుడు అయిన రామేండ్ల సుధీర్ దొంగతనం చేసానని ఒప్పుకున్నందున న్యాయమూర్తి ఒక ఏడాది సంవత్సరం జైలు శిక్ష , రూ.3,500 జరిమానా విధించినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



విద్యశ్రీ (ఫైల్)

చందుర్తి, మార్చి 5: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి అనుబంధ గ్రామమైన గొస్కులపల్లికి చెందిన ముదాం విద్యశ్రీ హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గొస్కులపల్లి గ్రామానికి చెందిన విద్యశ్రీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేస్తోంది. ఆరు నెలల క్రితం వరకు వర్క్ ఫ్రం హోం విధులు నిర్వహించింది. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ విధులకు హాజరవుతోంది. వేములవాడ చెందిన ఓ యువకుడితో ఈ నెల 17న వివాహం జరగాల్సి ఉంది. సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లోని బాత్‌రూంలో ఉరేసుకుంది. గమనించిన హాస్టల్ యాజమాన్యం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

వీణవంక, మార్చి5: వేతనాలు చెల్లించాలని మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. వేతనాలు సరైన సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. వేసవి దృష్ట్యా సమయాన్ని కుదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు కండే సదయ్య, కిషన్‌రావు, దాసారపు వెంకటేశ్, మహంకాళి కొంరయ్య, శంకర్, మల్లయ్య, లక్ష్మీ, నిజాముద్దీన్, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో మహాశివరాత్రికి ఏర్పాట్లు



వేములవాడలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ టౌన్, మార్చి 5: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రాజన్న క్షేత్రం ముస్తాబైంది. రాజన్న ఆలయంలో మూడు రోజులపాటు మహాశివరాత్రి జాతరను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రంగా ఏర్పట్లు సిద్దం చేస్తుంది. మహాశివరాత్రి జాతరకు సుమారుగా నాలుగు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం వున్నట్లు అధికారులు అంచానా వేస్తున్నారు. వేములవాడ ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పట్టణాన్ని సర్వంగ సుందరంగా సిద్దం చేశారు. వేములవాడలోకి ప్రవేశించే మార్గాలను కమాన్‌ల వద్ద స్వాగత తోరణాలను భక్తులకు స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. నందికమాన్ చౌరస్తాతో పాటు మూలవాగు బ్రిడ్జిపై రంగురంగుల విద్యుత్ దీపాలతో భక్తులను మంత్ర ముగ్దులు చేసేలా ఏర్పాట్లను చేశారు. రాజన్న ఆలయం విద్యుత్‌దీపాలతో వెలుగులు జిమ్ముతుంది. ఆలయ గర్భగుడి, మహామండపంతో పాటు ఆలయంలోకి ప్రవేశించి మార్గాల్లో రంగు రంగు పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఇతర రాష్ట్రాల నుంచి రానున్న భక్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర ప్రాంతాల వారు ఎక్కువ సంఖ్యలో రానున్నట్లు తెలుస్తుంది. దేవాలయానికి వచ్చే భక్తులు జాగం ముట్టించి మొక్కులు అప్పగించేందుకు వీలుగా భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, రీవో కృష్ణప్రసాద్‌లు ఎప్పటికప్పుడు ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. దేవాలయ పరిసరాల్లో 850 సీసీ కెమెరాలను, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సెంటర్‌కు అనుసందానం చేసి 24 గంటలు పోలీసుల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు చేపట్టారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసర సేవలు అందిచేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతర జరిగే ప్రాంతాల్లో, బస్టాండు సమీపంలో వైద్యకేంద్రాలను ఏర్పాటు చేసి 104, 108 వాహనాలను ఆలయ పరిసరాల్లో అందుబాటులో చర్యలు చేపట్టారు.

రాజన్న హుండీ ఆదాయం ఒక కోటి 14 లక్షలు

వేములవాడ టౌన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ అధికారులు, సిబ్బంది కలిసి హుండీ ఆధాయాన్ని లెక్కించగా రూ. ఒక కోటి 14 లక్షల 2 వేయిల 466 నగదు సమకూరగా 124 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 7 కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపును ఈవో కృష్ణప్రసాద్, కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఏసి చంద్రశేఖర్, పర్యవేక్షకులు ఏఈవో హరికిషన్, జయకుమారి, ప్రతాప నవీన్ తదితరులు పర్యవేక్షించారు.

విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి5 : విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నాతనియల్ తెలిపారు. విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్‌షిప్ అందించుటకు నిర్ణయించారన్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదివేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు కరీంనగర్ జిల్లాకు చెందిన ఎస్సీ కులమునకు చెందినవారై ఉండాలన్నారు. సంవత్సర ఆదాయం 5 లక్షలకు మించకుండా ఉండాలన్నారు. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలన్నారు. వీసా అర్హత కలిగి, విదేశీ విశ్వ విద్యాలయము నందు అడ్మిషన్ పొంది ఉండాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణ దరఖాస్తులకు తుది గడువు నేడు

గణేశ్‌నగర్, మార్చి 3: కరీంనగర్‌లోని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో (అంబేడ్కర్ స్టడీ సర్కిల్) గ్రూప్ 1,2,3,4, బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్, ఇతర పోటీ పరీక్షలకు 5 నెలల ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుకు బుధవారం తుది గడువని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న కరీంనగర్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికైన 100 మందికి ఉచిత భోజన, వసతులతో పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తారు.

8న ఎమ్మార్పీఎస్ సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 5: ఎమ్మార్పీఎస్ కరీంనగర్ నియోజకవర్గ సదస్సును ఈ నెల 8న నిర్వహిస్తున్నామని, ఈ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనీల్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని కార్ఖానగడ్డలో ఎమ్మార్పీఎస్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కొమ్ముల రమేశ్, ప్రధాన కార్యదర్శి దండు రమేశ్, ఉపాధ్యక్షుడిగా గాలి అరుణ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య, కనకం అంజిబాబు, నీర్ల కుమారస్వామి, మా రంపెల్లి మల్లేశం, గసికంటి వెంకన్న, చిలుక శ్రీనివాస్, విజయకుమార్, కొమ్ముల సాయికృష్ణ, కొమ్ముల రాజమల్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్

రుద్రంగి మార్చి 5: రుద్రంగి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన జమీర్ అనే యువకుడు ఎల్లమ్మ ఆలయ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 5: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి తెలిపారు. జమ్మికుంట మండలం నాగారం గ్రామానికి చెందిన కప్పంపల్లి రవి, వావిలాల గ్రామానికి చెందిన ఉర సంపత్‌లకు 9,597 రూపాయలు, 5,914 రూపాయల వంతున జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 5: విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివపురి రాజేశం కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల పాత్ర కీలకమన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశ్వకర్మల బతుకులు బాగుపడతాయని ఆశించి భంగపడ్డామన్నారు. తమ సమస్యలు తెలుపుదామంటే వినే నాయకుడే కరువయ్యాడని వాపోయారు. తమ వృత్తులకు ఆటంకం కలిగించే విధంగా అటవీశాఖ తీసుకువచ్చిన జీవోతో తమను కేసీఆర్ రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి బీసీ కులగణన చేస్తామని తీర్మానం ఆమోదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విశ్వకర్మల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 7న నగరంలోని ఇందిరా గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని విశ్వకర్మలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడే తమకు అనేక సంక్షేమ అందాయన్నారు. 2008లో వైఎస్ఆర్ ఉన్నపుడు జీవో 85 ద్వారా ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఫెడరేషన్ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాలచారి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గర్రెపల్లి నారాయణ స్వామి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చింతల రాజేశ్వర్, పూసాల నారాయణస్వామి, ఊకంటి ఓంకార్, చెల్పూరి జయ, జిల్లా మహిళ అధ్యక్షురాలు పోలోజు అంజలిదేవి, సావనపల్లి లక్ష్మీ, పోలోజు లక్ష్మీ, పోలోజు అంజమ్మ, పోలోజు విక్రమ్, గర్రెపల్లి రాజేశం పాల్గొన్నారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

ధర్మపురి, మార్చి 5: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. స్థానిక టీటీడీ ధర్మశాల ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశానికి డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జగిత్యాల డీఎస్పీ రఘునందన్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టాల్సిన వసతుల ఏర్పాట్ల గురించి చర్చించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరు కానున్న దృష్ట్యా ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవాభావంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం అదనంగా కార్మికులను నియమించి ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి క్షేత్రంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి అదనంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. గోదావరి నది, దేవాలయం, బస్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌కో డీఈఈ రాజరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ మురళి, మిష న్ భగీరథ డిఈఈ రాహుల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఈఈ నరసింహమూర్తిని వారి వారి విధులు సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డీఎం సుమతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమి షనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, సీఐ రాంనర్సిం హరెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఆర్యవైశ్య సంఘం నేత జక్కు రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఇల్లు కూల్చేందుకు అధికారుల యత్నం

● అడ్డుకున్న కుటుంబ సభ్యులు



అయిలయ్య ఇంటి వద్ద అధికారులు, పోలీసులు

శంకరపట్నం, మార్చి 5: గ్రామపంచాయతీ అనుమతి లేదని ఇంటిని కూల్చేందుకు అధికారులు సిబ్బందితో కలిసి రాగా కుటుంబీకులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. కరీంపేట గ్రామానికి చెందిన అంకతి రాజయ్య కుటుంబ సభ్యులు రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. ఆ ఇంటిలో రాజయ్య మేన అల్లుడు వనపర్తి అయిలయ్య కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. డీపీవో ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ మంగళవారం ఇంటి నిర్మాణం తొలగించుటకు అక్కడికి వెళ్లారు. ఇంటిలో నివాసం ఉన్న అయిలయ్య కుటుంబ సభ్యులు, వారి బంధు వులు ఆందోళనకు దిగారు. ఆత్మహత్య చేసుకుంటానని అయిలయ్య మందు డబ్బాతో బెదరించాడు. అధికారులు నాలుగు రోజుల గడువు ఇచ్చి వెనుదిరిగారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్టు



పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ క్రిష్ణ

పాలకుర్తి, మార్చి 5 : బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామంలో సోమవారం భార్యను హత్య చేసిన కొమురయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ తెలిపారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. రంగాపూర్ గ్రామానికి చెందిన కలవేన కొమురయ్య అనే సింగరేణి ఉద్యోగి తన భార్య కౌసల్య(43)ను గొడ్డలితో నరికి హత్య చేశాడన్నారు. కొమురయ్యను అరెస్టు చేయటంతో పాటు హత్యకు ఉపయోగించి గొడ్డలిని, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొమురయ్య, కౌసల్య మధ్య కొంత కాలంగా మనస్పర్థలు వచ్చి గొడవలు జరుగుతున్నాయని, కొమురయ్యకు రంగాపూర్‌లో వివాహేతర సంబంధం ఉన్నదని మృతురాలికి అనుమానం ఉండేదని,ఆ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. గోదావరిఖనిలో ఉద్యోగం చేస్తున్న కొమురయ్య రంగాపూర్‌లో వ్యవసాయం చేస్తున్నాడని, కొమురయ్య రంగాపూర్ లోనే ఉందామని అనగా మృతురాలు ఒప్పుకోలేదని, దీంతో భార్యను తప్పిస్తే తాను ప్రశాంతంగా ఉండొచ్చనే ఆలోచనతో గోదావరిఖని నుంచి ఇంటి సామానును తీసుకరావడానికి వెళ్లగా అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. అప్పటినుంచి కక్ష పెంచుకున్న కొమురయ్య సోమవారం మధ్యాహ్నం నిద్రిస్తున్న కౌసల్యను గొడ్డలితో నరికి చంపాడన్నారు. గొడ్డలిని గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్‌లో పడేసి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి రాత్రి అక్కడే ఉండి మంగళవారం గోదావరిఖనికి వెళ్తుండగా అందుగులపల్లి గ్రామ శివారులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని 24 గంటలలోపు అరెస్టు చేసినందుకు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామిని, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఈ పాత్రికేయుల సమావేశంలో పెద్దపల్లి సీఐ ఆర్ క్రిష్ణ, ఎస్ఐలు ఆర్ స్వామి, శివాణిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్ పేరుతో మోసం

● మెట్‌పల్లిలో యువకుడికి ఇబ్బందులు

మెట్‌పల్లి, మార్చి 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాంపల్లి శ్యామ్‌కుమార్ అనే ఓ ప్రైవేటు ఉద్యోగి లోన్ యాప్‌తో మోసపోయాడు. విషయం తెలియడంతో మంగళవాం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి శ్యామ్‌కుమార్ ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లోని కొత్తపేట పెట్రోల్ బంకు సమీపంలోని ఎస్‌బీఐ లోగోతో ఉన్న క్రెడిట్ కార్యాలయంలోకి వెళ్లాడు. క్రెడిట్ కార్డు కావాలని అక్కడ ఉన్న వారిని అడగా ఆయన సిబిల్ స్కోర్ పరిశీలించి నీకు రాదని తెలిపారు. నీకు కావాలంటే క్రెడిట్ బీ అనే లోన్ యాప్ ద్వారా తీసుకుంటే సిబిల్ స్కోర్ పెరుగుతుందని యాప్ డౌన్‌లోడ్ చేశారు. అన్‌లైన్ ద్వారా రూ. 3వేలు అకౌంట్‌కు జమ చేయించారు. అనంతరం దానిని తిరిగి చెల్లించాడు. మళ్లీ ఈ నెల 3న మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఆయన వాట్సాప్‌కు వివిధ ఫోన్ నంబర్ల ద్వారా పంపుతూ భయబ్రాంతులకు గురి చేశారు. దీంతో భయపడి వారు తెలిపిన యూపీఐడీ నంబర్లకు మొత్తం రూ. 32వేలు పంపించాడు. అంతేకాకుండా ఆయన ఫోన్ ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా మెసేజ్‌లు వెళ్లాయి. దీంతో మోసపోయానని గమనించిన శ్యామ్‌కుమార్ మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, మార్చి 5: మండలంలోని కేసీఆర్ తండాకు చెందిన గూగ్లావత్ లక్ష్మి(31) అను వివాహిత గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వేధింపులకు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మిని అదే గ్రామానికి చెందిన గూగ్లవత్ భాస్కర్ కొన్ని రోజుల నుంచి వెంటపడి వేధించాడు. దీంతో లక్ష్మి ఇటీవల పోలీసుస్టేషన్‌లో భాస్కర్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని మనసులో పెట్టుకున్న భాస్కర్ లక్ష్మిపై కోపం పెంచుకున్నాడు. మంగళవారం ఉదయం లక్ష్మి పొలం పనుల కోసం ఇంటి నుంచి బయలు దేరింది. మార్గ మధ్యలో భాస్కర్, గూగ్లవత్ సురేష్, గూగ్లవత్ వసంత అను ముగ్గురు తిడుతూ ఆమెపై చేయి చేసుకున్నారు. మనస్థాపానికి గురైన లక్ష్మి ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని ఇంట్లో ఉన్న అత్తమామలకు తెలిపింది. కాసేపటికి ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తరువాత కుటుంబ సభ్యులు చూసి భర్తకు సమచారం అందించగా ఇంటికి వచ్చి చూసేసరికి చనిపోయింది. మృతురాలి భర్త గూగ్లవత్ మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి నాలుగేళ్లలో తొమ్మిది ఉద్యోగాలు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, మార్చి 5: మండలంలోని కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో గురుకుల పాఠశాల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. నాలుగేళ్లలో తొమ్మిది ఉద్యోగాలు సాధించి సత్తా చాటిన సందర్భంగా మంగళవారం శ్రీనివాస్‌ను సన్మానించారు. మెదక్ జిల్లా హవేలీఘన్పూర్ మండలం పరీద్‌పూర్ తండాకు చెందిన శ్రీనివాస్ ఇప్పటి వరకు ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్, కో ఆపరేటీవ్‌లో అసిస్టెంట్ మేనేజర్, పంచాయతీ కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌సప్లైలో జూనియర్ అసిస్టెంట్, ఎఫ్‌సీఐలో జూనియర్ అసిస్టెంట్, బీఎస్ఎన్ఎల్‌లో జేఏవో, మున్సిపాలటీలో సీనియర్ అకౌంటెంట్, గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు పొందాడు. ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతో ఇంతకాలం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి పంచాయతీ కార్యదర్శిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాస తిరుపతి, ఎలుక స్వామి, అల్లెపు రజనీకాంత్, మామిడి రాజు, బిగుల్ల విజయ్, న్యాత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం ప్రారంభం



ఇల్లంతకుంటలో ప్రారంభిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, మార్చి 5: మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని మంగళవారం నాయకులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పథకం వర్తిస్తుందన్నారు. సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు అంతగిరి బాలపోచయ్య, కర్ణాకర్‌రెడ్డి, కాథ మల్లేశం, ఒగ్గు రమేష్, మామిడి నరేష్, శంకర్, గొడుగు నర్సయ్య పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి గడ్డం మధుకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం నరేశ్, కొంపెల్లి శ్యామ్, చిలుక శ్రీనివాస్, దూస మహేందర్, గోరంట్యాల రాజమల్లు, బల్ల లక్ష్మిపతి, అంబటి ఆంజనేయులు, బాగా రంగయ్య, పిస్క గురునాథ్, శ్రీగాధ అంబదాస్, అడిగొప్పుల యమున, కారంపూరి కమల, శ్రీపతి రుక్మిణి, జడల లక్ష్మి, ఈగ లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): గృహ జ్యోతి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఇంటా వెలుగులు నింపుతోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావుతో కలిసి ఇంటింటా 200 యూనిట్ల లోపు జీరో కరెంట్ బిల్లులను అందించారు. సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు వంగ గిరిధర్ రెడ్డి, ఎస్.కె గౌస్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని సుభాస్‌నగర్‌లో వినియోగదారులు ఇండ్లలోకి స్వయంగా వెళ్ళి గృహజ్యోతి పథకం క్రింద విద్యుత్ మీటర్ నుండి జీరో బిల్లులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు ఏడీ మహేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏఈ రుషిక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా కార్యదర్శి రామాచంద్రారెడ్డి, నాయకులు ఉన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లోని గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌కు సంబంధించి జీరో బిల్లు పంపిణీని మంగళవారం సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేజ్ రోడ్డులోని లబ్ధిదారుల ఇళ్లలో జీరో కరెంట్ బిల్లును అందజేశారు. సెస్ ఏడీ శ్రీధర్‌రావు, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో తడాఖా చూపాలి



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్

ముస్తాబాద్, మార్చి 5 : పార్లమెంట్ ఎన్నికల్లో తడాఖా చూపాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ ముస్తాబాద్ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మొదటగా పార్టీ జెండావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ 14 ఏళ్లపాటు ప్రజల ఆదరణతో 100 కిలో మీటర్లు వేగంతో పరుగెత్తామని, పదేళ్లపాటు అధికారంలోకి వచ్చి 100 కిలోమీటర్ల వేగంతో వెళ్తే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైల్లు పరిగెత్తాయని అన్నారు. 420 హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 5 లక్షల ఓట్లు తక్కువ వచ్చాయని దీంతో అధికారం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మళ్లీ పార్లమెంటరీ ఎన్నికలతో 100 కిలోమీటర్ల వేగంతో ముందుకు వెళ్తామన్నారు. రైతు బంధు, రుణమాఫీ చేస్తామని హామీలిచ్చి 100 రోజుల్లోనే కాంగ్రెస్ విఫలమైందన్నారు. ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఇప్పటికే కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారు ఎందుకు వేశామా? అని అనుకుంటున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాదు అనుకోలేదని ప్రజలు అనుకుంటున్నారన్నారు. ఏప్రిల్, మే నెలలో తెలంగాణ రైతులకు కేసీఆర్ విలువ తెలిసి వస్తుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ వచ్చాక మండుటెండల్లో చెరువులు మత్తడి దుంకాయని గుర్తు చేశారు. రైతన్నలను, చేనేత కార్మికులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవడానికి సుముఖత చూపడం లేదని అన్నారు. మహేందర్‌రెడ్డి వారిపై ఇష్టారీతిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, టీఎస్‌పీఎస్‌సీ మాజీ మెంబర్ డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ బాపురావుమాజీ ఆర్‌బీఎస్ డైరెక్టర్ గోపాల్‌రావు, మాజీ ఎఎంసీ చైర్మన్ శీలం జనాబాయి, యాది మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి, నాయకులు విజయరామారావు, మెంగని మనోహర్ శీలం స్వామి, దబ్బెడ రేణుక, స్వర్ణలత, సావిత్రి, కొండ శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి, సర్వర్‌పాషా, కొమ్ము బాలయ్య, సంతోష్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని తెర్లుమద్దిలో యాదవ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న ఉత్సవాలకు ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. రామలక్ష్మణపల్లెలో జరిగిన పెద్దమ్మ ఉత్సావాల్లో పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

తంగళ్లపల్లి: చిట్యాల ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసు కోవాలని బీఆర్‌ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కే తారక రామారావు అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం అంకు సాపూర్‌లో చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చాలా అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా స్థానిక ఎమ్మెల్యేగా సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేసేది లేదన్నారు. అంతకుముందు దివ్యాంగురాలి అభ్యర్థన మేరకు స్కూటి అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామరావు, ఎంపీపీ పడిగెల మానస రాజు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, స్థానిక ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు రాంరెడ్డి, అడగట్ల భాస్కర్, కుర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోయినపల్లి, మార్చి 5: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ అమలు చేసిన సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీం రెడ్డి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బోయినపల్లి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగుల కనుకయ్య, ఎంపీటీసీ ఉయ్యాలా శ్రీనివాస్ గౌడ్, బాలాగోని శ్రీనివాస్, అక్కనపెల్లి ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన మద్యం దుకాణాలను తొలగించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 5 : పట్టణాల్లో రోడ్డు పక్కన ఉన్న మద్యం దుకణాలను తొలగించాలని ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో జనావాసాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మద్యం షాపులు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 9న సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ జెండా చౌరస్తాలో వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ తదితరులు పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలను తిప్పికొడతాం

గంభీరావుపేట, మార్చి 5: తమ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు కుట్ర పూరిత రాజకీయాలకు తెరలేపారని, వాటిని తిప్పి కొడతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. గంభీరావుపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు పనిగట్టుకొని కేకే మహేందర్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేకే మహేందర్‌రెడ్డికి కేబినేట్ హోదా వస్తున్న క్రమంలో జీర్ణించుకోలేని కొందరు బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా కార్యదర్శి రామాచంద్రారెడ్డి, ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు శ్రీనివాస్, నుషరత్, జంగం రాజులు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పార్లమెంటరీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట) మార్చి 5 : ఈనెల 8న కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ పార్లమెంటరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాదిగ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా మాదిగ ఉపకులాలు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఆకారం రాజు, ఎలగందుల బాబు, కూడలి అశోక్, సంసంగ్, నేదూరి శ్రీనివాస్, సుంకపాక గంగయ్య తాళ్లపల్లి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

గంభీరావుపేట, మార్చి 5 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో స్త్రీల ఆరోగ్యంపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. గైన కాలజిస్ట్ డాక్టర్ మాధవి. బి.మేఘన, ఎన్.సాయి పల్లవి పలు అంశాలపై అవగాహన కల్పించారు. మంచి ఆహారం అలవాట్లపై పలు సూచనలు ఇచ్చారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై మార్కెటింగ్ మేనేజర్ కౌశిక్ విద్యార్థులకు వివరించారు.

ఆసాములందరికీ ప్రభుత్వ ఆర్డర్‌లు అందించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 5 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న ఆసాములందరికీ ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి చేరాల అశోక్ డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వస్త్ర పరిశ్రమల బంద్ పాటించారు. అనంతరం బీవైనగర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ పూర్తిగా మూతపడడంతో ఆసాములు, కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. సంక్షోభాన్ని నివారించాలని సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరినట్లు చెప్పారు. మూడు నెలలుగా ప్రభుత్వం, యజమానుల నుంచి తమకు ఎలాంటి సహాయ సహకారాలూ అందడం లేదన్నారు. పాలిస్టర్ వస్త్రంతో నష్టం వస్తోందని యజమానులు పరిశ్రమలను బంద్ చేశారన్నారు. సిరిసిల్ల నుంచి పాలిస్టర్ వస్త్ర పరిశ్రమలు మహారాష్ట్రలోని మాలేగావ్‌కు, కాటన్ పరిశ్రమలు బల్బోత్రకు వెళ్లిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే బతుకమ్మచీరల ఆర్డర్‌లే తమకు ఉపాధిని ఇచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభం నుంచి వస్త్ర పరిశ్రమను గట్టెక్కించాలన్నారు. కార్యక్రమంలో మండల రాజు, ఆసాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లికార్జున స్వామి జాతర

మెట్‌పల్లి రూరల్, మార్చి, 5 : మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని మల్లిఖార్జున స్వామి ఆలయం జాతర ఉత్సవాలు మంగళవారం ముగిసాయి. ఉదయం ఆలయంలో స్వామి వారికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయం ఎదుట అగ్నిగుండం(నాగవెల్లి) కార్యక్రమాన్ని యాదవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అ నంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

ఆ పదాలను వెనక్కి తీసుకుంటున్నా

కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మార్చి 5: ఆ పదాలతో ఆ కులం ఆత్మాభిమానం, మనోభావాలు దెబ్బతింటే వాటిని భే షరతుగా వెనక్కితీసుకుంటున్నాని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండుమూడు రోజుల నుంచి కొన్ని ట్రోలింగ్‌లు వస్తున్నాయన్నారు. వ్యక్తిగతంగా తనకు సంబంధం లేకున్నా సందర్భోచితంగా మాట్లాడిన కొన్ని పదాలను కొంత మంది తమ స్వార్థానికి వాడుకున్నారని, ఒక జాతిని కులాన్ని కించపరిచే విధంగా మలుచుకొని లబ్ది పొందే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాజకీయ చందరంగంలో ఆ కులాని ఆత్మగౌరవాన్ని ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టే విధంగా వారు వ్యవహరిస్తున్న తీరు తనకు నచ్చడం లేదన్నారు. రాజకీయంగా తనను అస్థిరపర్చాలని ఇందంతా చేస్తున్నట్లు బావిస్తున్నామన్నారు. అవసరాల కోసం అహంకారంతో ఎప్పుడూ మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. కొంతమంది వక్రీకరించి ఇలా చేస్తున్నారన్నారు. రాజకీయం సామాజిక బాధ్యతగా భావిస్తానని, ఎవరినీ కించపరిచే విధంగా ప్రవర్తించ లేదని అన్నారు. ఆ పదాలతో మనస్సులు గాయపడినట్లైతే ఆ పదాలను వెనక్కితీసుకుంటున్నాని, నిజాలన్ని నిలకడగా తెలుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మూల స్వరూప, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ, నాయకులు వెల్మూల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, వైద్య శివప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

కేకే మహేందర్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 5: పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం ఆయన దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పద్మశాలి సంఘం యుజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, నాయకుడు బొల్లి రామ్మోహాన్ మాట్లాడారు. సిరిసిల్ల నేతన్నలపై కేకే మహేందర్‌రెడ్డికి అక్కసు ఉందన్నారు. క్షమాపణ చెప్పకుంటే రాజకీయంగా బొందపెడతామని హెచ్చరిం చారు. క్షమాపణ చెప్పకుంటే ఈ నెల 7న ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమాలను అడ్డుకుంటామని, సిరిసిల్ల బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. సిరిసిల్ల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య, మోర రవి, సహాయ కార్యదర్శి రాపెల్లి ప్రవీణ్‌కుమార్, సంఘం డైరెక్టర్లు, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్, బింగి రాంబాబు పాల్గొన్నారు.

వేములవాడను అభివృద్ధి పథంలో నడిపించాలి

వేములవాడ, మార్చి 5 : గత ప్రభుత్వం హయాంలో రాజన్న ఆలయానికి అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. వేములవాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాశివరాత్రి జాతరకు వస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయం నుంచి బ్రిడ్జి వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో భక్తులకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. రోడ్డ విస్తరణపై దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న మరో బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని అన్నారు. దేవాలయంలో జరుగుతన్న అవినీతిపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలన్నారు. దేవాలయానికి అధిక నిధులు కేటాయించాలని, పట్టణ అభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు. ఈ పమావేశంలో ఎగుమాంటి ఎల్లారెడ్డి, జవాజి విమల, ముక్తికాంతం అశోక్, టురజాల శ్రీధర్, రామంచ అశోక్, మల్లారపు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట, మార్చి 5: కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో రూ .51,111 విరాళం అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులంలోకి రాజకీయాలను తీసుకురావద్దు



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం అధ్యక్షుడు, నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 5: కులంలోకి రాజకీయాలను తీసుకురావద్దని సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో కొందరు పద్మశాలీలు విద్వేశాలను రెచ్చగొట్టే విధంగా చేస్తున్నారని, వాటిని గమనిస్తూ విద్వేశాలకు లోనుకావద్దని అన్నారు. ఐక్యతను దెబ్బతీయవద్దని, పద్మశాలీలను కించపరిచే విధంగా కేటీఆర్, బండి సంజయ్, కేకే మహేందర్‌రెడ్డి ఎవరు మాట్లాడినా తప్పు తప్పే అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్ర సంక్షోభంతో ఆసాములు, కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఈ ఇబ్బందులకు గత ప్రభుత్వమే కారణమన్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఆసామి అయనకు తెలిసిన వృత్తిని చేసుకుంటూ ఉపాధి పొందుతున్న దృష్యాలను ఓ పాత్రికేయుడు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినట్లు తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కారణంగానే ఉపాధి లేదంటూ ఆ కారణంగానే పాపుడాలు అమ్ముకుంటున్నట్లు వక్రీకరించి సోషల్ మీడియాలో చూపించారన్నారు. మూడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సమంజసం కాదన్నారు. పద్మశాలీలను కించపరిచింది కేకే మహేందర్‌రెడ్డియా? పాత్రికేయుడా? ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. గతంలో మాజీ మంత్రి కేటీఆర్ పద్మశాలీలను కల్లు, గుడాలు తింటారంటూ సభలోనే అన్నారని, తామెప్పుడూ క్షమాపణ కోరలేదని అన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కూడా పద్మశాలి కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడితే పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ప్రెస్ మీట్‌లో ఖండించినట్లు చెప్పారు. కులంలోకి రాజకీయాలను తీసుకు రావద్దన్నారు.

● కేకే మహేందర్‌రెడ్డి పద్మశాలీలను కించపరచాడంటూ నిన్నటి రోజు కొందరు నాయకులు మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. గతంలో ఓ బహిరంగ సభలో కేటీఆర్ పద్మశాలీలు కల్లు గుడాలు తింటారంటూ కించపరిచే విధంగా మాట్లాడితే ఇదే నాయకులు ఎందుకు ఖండించలేదన్నారు. పద్మశాలి సంఘం మహిళ విభాగం అధ్యక్షురాలు కాముని వనిత మాట్లాడుతూ కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడిన వాయిస్‌లో పద్మశాలీలు అన్నమాట రాలేదని, గమనించాలని అన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి పద్మశాలీలకు వస్త్ర పరిశ్రమను నమ్ముకున్న వారికి అగాదం సృష్టించే విధంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ, సంఘం నాయకులు కోడం శ్రీనివాస్, సామల దేవదాస్, ఆడెపు ప్రభాకర్, వంగరి దేవదాస్, రాపెల్లి కళ్యాణ్, వెంగల అశోక్, కాముని నళినీకాంత్ పాల్గొన్నారు.

కేకే మహేందర్‌రెడ్డిపై అసత్య ప్రచారం తగదు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట) మార్చి 5: సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిపై తప్పుడు ప్రచారం తగదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీల సంక్షేమం కోసం కేకే మహేందర్‌రెడ్డి ఎన్నో రకాలుగా పాటుపడుతున్నారని, ఈ విషయం పద్మశాలీలకు తెలుసని అన్నారు. బతుకమ్మ చీరల బకాయిలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కొంతమంది పనిగట్టుకొని తప్పుడు వీడియోలతో ప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ఆస్తులు అమ్ముకొని పేదల కోసం నిరంతరం కష్టపడుతున్నారన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభావం తగ్గుతోందని, ఇది తట్టుకోలేకనే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, కొమరిశెట్టి తిరుపతి, కరికె శ్రీనివాస్, మొగుళ్ల మధు, షకీల్, రామ్, చంద్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

గంభీరావుపేట, మార్చి 5 : అదనపు వర కట్నం వేధింపులపై బీబీపేటకు చెందిన మ్యాదరి నవీన్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన స్వర్ణలతతో బీబీపేటకు చెందిన నవీన్‌తో 2023లో ప్రేమపెళ్లి జరిగింది. నవీన్ కొన్ని నెలలుగా అదనంగా రూ.5 లక్షల కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని స్వర్ణలత ఫిర్యాదులో పేర్కొంది. భర్తతోపాటు అతడి అక్క రాజమణి, ఆమే కొడుకులు భరత్, అభి, భర్త అన్న కాశయ్య అదనంగా కట్నం తేవాలని వేధిస్తున్నారని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో వారందరు తనను కొట్టి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

తంగళ్లపల్లి, మార్చి 5: తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులోని పెద్దమ్మ ఆలయంలో చోరి జరిగింది. దేవాలయం ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి హుండీలోని నగదుతో పాటు మైకు సెట్టును ఎత్తుకెళ్లారు. బోరు మోటారు, స్టాటర్, వైరు సైతం చోరీ చేశారు. సామగ్రి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెపాఅరు.

వరి సాగుపై రైతులకు అవగాహన

ముస్తాబాద్, మార్చి 5: మండలంలోని ఆవునూర్ గ్రామంలో వరి పంట సాగుపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసి సమావేశంలో వరి పంట సాగు విధానం పంటకు సోకే మగిపురుగు, ఈగ్గితెగుల్లు, జింక్ లోపాలు చీడ పీడలు వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏవో మమత, వెంకటేశ్, ఏఈవో ప్రదీప్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

ఇల్లంతకుంట, మార్చి 5: మండలంలోని కందికట్కూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో టీఎల్‌ఎమ్ మేళాను ఎంఈవో బన్నాజీ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ముత్యం అమర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు సరోజ, రిజ్వాన, కిషోర్, బాగ్యలక్ష్మి, జితేందర్, రాజు పాల్గొన్నారు..

మద్యం తాగి వాహనాలు నడపవద్దు

జగిత్యాల టౌన్, మార్చి 5: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. మూడు నెలల డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, వాహనాల తనిఖీ తదితర అంశాలపై పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. నెలరోజుల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 956 మంది పై కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో 223 మంది వ్యక్తులకు కోర్టు ద్వారా రూ. 1,98,400 జరిమానా విధంచామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమంతప్పకుంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు.

నేతన్నల సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మరమగ్గాల కార్మికులు

సిరిసిల్ల రూరల్, మార్చి 5 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం నుంచి మంగళవారం పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కొత్త బస్టాండ్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలంటూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రస్తుతం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం, ప్రభుత్వం బతుకమ్మ చీరలఆర్డర్‌లను ఇవ్వక పోవడం, పెండింగ్ సమస్యలను పరిష్కారించకపోవడంతో వేలాది మంది మరమగ్గాల కార్మికులతోపాటు అనుబంధ రంగాల కార్మికులు, ఆసాములు ఉపాధిని కోల్పోయి ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభం, సమస్యలపై ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వస్త్ర పరిశ్రమల సమస్యలను ప్రభుత్వంతోపాటు సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ఏలిగేటి రాజశేఖర్, దేవదాస్, సిరిమల్ల సత్యం, రవి, గణేష్, మచ్చ వేణు, సురేష్, రవీందర్, సత్యం, వెంకటేశం, రాజు, ప్రవీణ్, సత్యనారాయణ, ప్రభాకర్, శ్యాం, భాస్కర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

సిరిసిల్ల రూరల్, మార్చి 5 : దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేడమే లక్ష్యంగా ఐడియా స్వచ్ఛంద సంస్థ నిరంతరం పని చేస్తోందని ఐడియా స్వచ్ఛంద సంస్థ సహవ్యవస్థాపకుడు రాహుల్ సరిదేనా అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఓఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఐడియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల అభివృద్ధి కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ సరిదేనా మాట్లాడుతూ 2030లోగా 10వేల మంది దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలతోపాటు 5వేల మందిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే 2200 మందిని వ్యాపారవేత్తలుగా తయారు చేసినట్లు చెప్పారు. ఐడియా సంస్థకు మల్లికార్జున్ ఐతా వ్యవస్థాపకుడుగా ఢీల్లీ కేంద్రంగా పని చేస్తోందన్నారు. దివ్యాంగుల్లో ఉన్న శక్తిని చాటడం కోసం సిరిసిల్లలో వ్యాపారలావాదేవీలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని మండలాల నుంచి వచ్చిన దివ్యాంగులను 60 మందికి ఒక్కొక్కరికి రూ.22వేల నుంచి రూ.25 ఖాతాల్లో జమచేసి తోడ్పాటును అందించనున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలను అవమానపరిస్తే సహించం



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, మార్చి 5: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలను నమ్ముకొని జీవిస్తున్న పద్మశాలీ కులస్తులను అవమానపరిస్తే సహించబోమని, వెంటనే కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో మాజీమంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ పద్మశాలీలను తాగుబోతులతోపాటు కల్లుగుడాలకే పరిమితమని అవమానించారని, ఇటీవల సెస్ చైర్మన్ చిక్కాలరామారావు పద్మశాలీల ఓట్లతోనే గెలుపొందామంటూ అపహ్యంగా మాట్లాడారని అన్నారు. ఇవి పట్టించుకోని పద్మశాలీ సంఘం ప్రతినిధులు కాంగ్రెస్‌నేత కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడిన మాటలకు స్పందించడం సరికాదన్నారు. కేటీఆర్ అవమానించినప్పుడు స్పందించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు. ఏదిఏమైనా కేకే మహేందర్‌రెడ్డి పద్మశాలీకులస్థులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నరేష్, కొండనరేష్, ఉరగొండరాజు, మోర శ్రీహరి, గాజుల సదానందం, కోడం శ్రీనివాస్, మోర రవి, సుంకరి బాలకిషన్, వేముల పోశెట్టి, సుంచు ప్రకాష్, చొప్పదండి శ్రీనివాస్, బండారి వెంకటేశం, మహేశుని అనిల్, రచ్చరాహుల్ తదితరులు పాల్గొన్నారు.